ANN తెలుగు
Follow: @ANNTELUGU
23-08-2026
# మహా పత్రిక
ఆదివారం, హైదరాబాద్ సంపుటి- 23 సంచిక- 229 పేజీలు-08 వెల-రూ.1
PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM



## ఇదేం ఆత్మనిర్భర్ భారత్?

- మూడునెలల్లో చక్కెరధర 40శాతం పెరగడం ఏంటి?
- పండుగ ముందు చక్కెర కొరత ఏంటి?
- తీవ్రంగా ఫైర్ అయిన మల్లిఖార్జున్ ఖర్గే

**ఢిల్లీ, మహా :** దేశీయ మార్కెట్లో చక్కెర ధరల పెరుగుదల, కొరత నేపథ్యంలో కేంద్రం తీరుపై ఏఐసీసీ అధ్యక్షుడు మల్లిఖార్జున్ ఖర్గే మండి పడ్డారు. మోదీ ప్రభుత్వం విధానాల వల్ల పండుగల సీజన్‌కు ముందే సామాన్య ప్రజలపై ఆర్థిక భారం పడుతుందని, మోదీ ప్రభుత్వ విధానాల్లోని చేదు, చక్కెరలోని మాధుర్యానికి పాకింది' అని కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే ఎద్దేవా చేశారు. కేంద్ర ప్రభుత్వాన్ని విమర్శిస్తూ, ఆయన శనివారం ఎక్స్‌లో పలు ప్రశ్నలు సంధించారు. "మోదీ ప్రభుత్వానికి నేను సూటిగా మూడు ప్రశ్నలు అడుగుతున్నా. ప్రపంచంలోనే అతిపెద్ద చక్కెర ఉత్పత్తిదారు, ఎగుమతిదారు అయిన భారతదేశంలో, చక్కెర నిల్వలు గత 9 ఏళ్లలో ఎన్నడూ లేనంత కనిష్ట స్థాయికి ఎందుకు పడిపోయాయి? ఎగుమతులను నిలిపివేసి, 10 లక్షల టన్నుల చక్కెరను సుంకం

మిగతా 2వ పేజీలో

టాప్ న్యూస్



### కొండా సుస్మిత లైన్ దాటి ఆరోపణలు చేశారు

- టీపీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్
- రాజగోపాల్ రెడ్డి హద్దుమీరలేదు

02

### డీఎస్సీపై జగన్‌కు లోకేశ్ ఐదో సవాల్



- 'టైమ్, డేట్ నువ్వే ఫిక్స్ చెయ్.
- చర్చకు నేను సిద్ధం'.
- విజయనగరం టీడీపీ కార్యకర్తల సమావేశంలో మంత్రి నారా లోకేశ్ పిలుపు

03

### నన్ను టార్గెట్ చేస్తున్నవారిపై చర్యలు తీసుకోండి



- మంత్రి కొండా సురేఖ మరో లేఖ

03



### మెట్రో రెండోదశలో భూగర్భ మార్గాలు

02

- విమానాశ్రయాలు, రైల్వే ట్రాక్‌ల వద్ద ప్రత్యేక డిజైన్
- రూ.38,595 కోట్లతో మెట్రో రెండోదశ



02

### ఆర్ఎఫ్‌సీఎల్ షట్‌డౌన్‌పై తుమ్మల ఆందోళన

- యూరియా ఉత్పత్తి నిలిచిపోవడంపై కేంద్రం తక్షణమే జోక్యం చేసుకోవాలి





# లండన్‌లో సీఎం రేవంత్‌రెడ్డి

**కేంబ్రిడ్జి వర్సిటీని సందర్శించిన సీఎం బృందం**

- విద్య, పరిశోధనల్లో భాగస్వామ్యంపై చర్చ
- హైదరాబాద్‌లో ఎడ్యుకేషన్, రీసెర్చ్ ప్రోగ్రామ్‌లు పెట్టాలని కోరిన సీఎం బృందం
- నేటితో ముగియనున్న పర్యటన
- సీఎం అమెరికా పర్యటనకు అడ్డంకులపై ఏఐసీసీ అధ్యక్షుడు మల్లిఖార్జున్ ఖర్గే ఆగ్రహం
- ముఖ్యమంత్రులు వెళ్ళి పెట్టుబడులు తెస్తారనే భయం కేంద్రంలో ఉందని చురకలు

**హైదరాబాద్, మహా :** లండన్‌లోని ప్రఖ్యాత కేంబ్రిడ్జ్ వర్సిటీని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బృందం సందర్శించింది. విద్య, పరిశోధన రంగాల్లో భాగస్వామ్యంపై కేంబ్రిడ్జ్ ప్రతినిధులతో సీఎం చర్చించారు. హైదరాబాద్‌లో ఎడ్యుకేషన్, రీసెర్చ్ ప్రొగ్రామ్‌లు పెట్టాలని కోరారు. యువపారిశ్రామికవేత్తలకు ఇంక్యుబేషన్, స్టార్టప్‌ల అభివృద్ధిలో భాగస్వామ్యం చేయాలని విజ్ఞప్తి చేశారు. స్పష్టమైన కార్యచరణ ప్రణాళికను రూపొందించుకోవాలని ఇరువర్గాలు నిర్ణయం తీసుకున్నారు. ఈ కార్యక్రమానికి మంత్రి శ్రీధర్‌బాబు, సీఎం సలహాదారు రామకృష్ణారావు, ప్రత్యేక సీఎస్ జయేశ్ రంజన్‌లు హాజరయ్యారు. మరోవైపు సీఎం రేవంత్ పర్యటనకు కేంద్రం నో చెప్పడాన్ని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తీవ్రంగా తప్పుపట్టారు.

**ప్రభుత్వంతో కలిసి పనిచేసేందుకు లివర్‌పుల్ ఆసక్తి**

లైఫ్ సైన్సెస్, టెక్నాలజీ, క్రీడలు, సృజనాత్మక ఆర్థిక వ్యవస్థకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి పనిచేసేందుకు లండన్‌లోని లివర్‌పూల్ సిటీ డెవలప్‌మెంట్ విభాగం ఆసక్తి చూపింది. భాగస్వామ్య ఒప్పందం చేసుకునేందుకు లివర్‌పూల్ ప్రతినిధి బృందం అక్టోబర్‌లో హైదరాబాద్ రానుంది. లండన్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని లివర్‌పూల్ సిటీ డెవలప్‌మెంట్ విభాగానికి చెందిన సుసాన్ ఫిన్నెగాన్, నూలా గల్లాఘర్, లివర్‌పూల్ ఫుట్ బాల్ క్లబ్‌కు చెందిన పలువురు మర్యాదపూర్వకంగా కలిశారు.

**తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌కు రండి**

లండన్‌లోని ప్రఖ్యాత ఇంపీరియల్ కాలేజీని సీఎం సలహాదారు రామకృష్ణారావు సందర్శించారు. ఇంపీరియల్ కాలేజీ చీఫ్ ఆఫ్ స్టాఫ్, అమాండా వోల్తుయిజెన్,

మిగతా 2వ పేజీలో





### గచ్చిబౌలిలో అక్రమ భవనాలపై హైడ్రా ఉక్కుపాదం

50 గజాల్లో ఏడంతస్తులు.. ఇద్దరి మృతి

నాలాలపై నిర్మాణాలపై ప్రత్యేక డ్రైవ్‌కు రంగనాథ్ ఆదేశం

**హైదరాబాద్, మహా :** .గచ్చిబౌలి అంజయ్య నగర్‌లో నిర్మాణంలో ఉన్న ఏడంతస్తుల భవనం ఒక్కసారిగా కుప్పకూలిన ఘటన హైదరాబాద్‌లో సంచలనం సృష్టించింది. నాలాను ఆనుకుని కేవలం 50 చదరపు గజాల స్థలంలో నిర్మించిన ఈ భవనం శనివారం మధ్యాహ్నం పేకమేడలా కూలిపోవడంతో మధ్యప్రదేశ్‌కు చెందిన ఇద్దరు కార్మికులు ప్రాణాలు కోల్పోయారు. శిథిలాలు పక్కనే ఉన్న భవనంపై పడటంతో పలు ఫ్లాట్లు దెబ్బతిన్నాయి. సమీపంలోని హాస్టల్ నుంచి విద్యార్థులను కూడా భద్రతా కారణాలతో బయటకు తరలించారు. ఘటనపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్.. నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన ట్టడాలపై ఇక కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు.ప్రమాద సమాచారం అందుకున్న వెంటనే మాదాపూర్ పోలీసులు, హైడ్రా, అగ్నిమాపక

మిగతా 3వ పేజీలో





### బీజేపీ కొత్త టీమ్‌తో ప్రధాని మోదీ భేటీ

02

- నూతన జాతీయ కార్యవర్గంతో సమావేశం
- కొత్త ఆలోచనలతో పార్టీని బలోపేతం చేయాలని దిశానిర్దేశం
- 14 ఏండ్లు పైబడిని వారిని లక్ష్యంగా చేసుకుని కార్యక్రమాలు

### బల్దియాలో దోచుకున్న వారికి దోచుకున్నంత

- పనులు లేకున్నా బిల్లుల పంపకానికి స్కెచ్ వేసారనే ఆరోపణలు
- కాంట్రాక్టర్లకు అప్పనంగా బిల్లుల ఆశలు
- ముందుగా కమిషన్లు.. తర్వాత బిల్లులు
- ఆలస్యంగా వెలుగులోకి వస్తున్న పాత బిల్లుల బాగోతం

05






### నేషనల్ బెస్ట్ టీచర్ అవార్డుకు ఎంపికైన కామారెడ్డి టీచర్

- రాష్ట్రం నుంచి ఒక్క ఉపాధ్యాయురాలే ఎంపిక
- రాష్ట్రపతి చేతుల మీదుగా అవార్డు అందుకోనున్న భవాని
- వచ్చే నెల 5 న రాష్ట్రపతి చేతుల మీదుగా అవార్డు అందుకోనున్న టీచర్

02



MANDIRA by manepally PREMIUM SILVER JEWELLERY
Purchase ₹ 50,000/-
Free Jewellery Voucher of
₹ 15,000/-
along with
FREE GOLD COIN
Purchase ₹ 1.00,000/-
Free Jewellery Voucher of
₹ 30,000/-
along with
FREE GOLD COIN




MANDIRA by manepally | PREMIUM SILVER JEWELLERY
PUNJAGUTTA 99590 11192
A.S. RAO NAGAR 99590 11194

### పెట్టుబడులకు తెలంగాణే బెస్ట్ డెస్టినేషన్

: మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

02



# నేషనల్ బెస్ట్ టీచర్ అవార్డుకు ఎంపికైన కామారెడ్డి టీచర్




**కామారెడ్డి, మహా :** కామారెడ్డి జిల్లా గాంధారి మండల కేంద్రంలోని ఎంపీపీ గర్ల్స్ ప్రైమరీ స్కూల్ ఉపాధ్యాయురాలు భవాని అరుదైన గౌరవం దక్కించుకున్నారు. జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారానికి ఆమె ఎంపికయ్యారు. దేశవ్యాప్తంగా కేంద్ర విద్యాశాఖ ఎంపిక చేసిన 48 మంది ఉత్తమ ఉపాధ్యాయుల్లో తెలంగాణ నుంచి భవాని ఒక్కరే స్థానం సంపాదించారు. వినూత్న బోధనా పద్ధతులు, విద్యార్థుల సర్వతోముఖ అభివృద్ధికి చేస్తున్న కృషికి గుర్తింపుగా ఆమెకు ఈ పురస్కారం దక్కింది. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా వచ్చే నెల 5న ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో జరిగే ప్రత్యేక కార్యక్రమంలో రాష్ట్రపతి చేతుల మీదుగా భవాని ఈ ప్రతిష్ఠాత్మక పురస్కారాన్ని అందుకోనున్నారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ నవీన్ నికోలస్ ఆమెను అభినందించారు. గ్రామీణ ప్రాంతంలోని ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తూనే విద్యార్థుల్లో అభ్యసన ఆసక్తిని పెంచేందుకు ఆమె చేస్తున్న ప్రయోగాలు ప్రశంసనీయమని పేర్కొన్నారు. భవాని బోధన పద్ధతిలో ప్రత్యేకత ఉంది. సాధారణంగా పుస్తకాల్లోని పాఠాలను చదివించి పరీక్షలకు సిద్ధం చేయడం కంటే పిల్లలు స్వయంగా నేర్చుకునేలా యాక్టివిటీ బేస్డ్ లెర్నింగ్‌కు ఆమె ప్రాధాన్యం ఇస్తున్నారు. పాఠ్యాంశాలను విద్యార్థులకు సులభంగా అర్థమయ్యేలా చేయడంతో పాటు, నేర్చుకున్న విషయాలు ఎక్కువకాలం గుర్తుండిపోయేలా సృజనాత్మక పద్ధతులను వినియోగిస్తున్నారు. ఖ్యంగా నృత్య రూపకాలను ఉపయోగించి పాఠాలను బోధించడం ఆమె ప్రత్యేకతగా నిలిచింది. క్లిష్టంగా అనిపించే అంశాలను పాటలు, నృత్యాలు, కార్యకలాపాలతో అనుసంధానం చేయడం ద్వారా చిన్నారుల్లో ఆసక్తిని పెంచుతున్నారు. దీంతో తరగతి గదిలో విద్యార్థుల భాగస్వామ్యం పెరగడంతో పాటు, పాఠ్యాంశాలను ఆచరణాత్మకంగా అర్థం చేసుకునే అవకాశం లభిస్తోంది. పాఠశాలలో విద్యార్థులు చేపట్టే వివిధ కార్యక్రమాలను రికార్డు చేసి యూట్యూబ్ ఛానల్ ద్వారా అందుబాటులో ఉంచుతున్నారు. విద్యార్థుల ప్రతిభ, సృజనాత్మకతను ప్రోత్సహించడంతో పాటు వారి కార్యకలాపాలను తల్లిదండ్రులు, ఇతర ఉపాధ్యాయులు కూడా వీక్షించే అవకాశం కల్పిస్తున్నారు. ఇటీవల విద్యాశాఖ ఆధ్వర్యంలో ఫిన్లాండ్ పర్యటనకు వెళ్లిన 40 మంది ఉపాధ్యాయుల బృందంలో భవాని కూడా ఉన్నారు. ఫిన్లాండ్‌లో అమలవుతున్న ఆధునిక విద్యా విధానాలు, విద్యార్థి కేంద్రిత బోధనా పద్ధతులను ఆమె పరిశీలించారు. అక్కడ నేర్చుకున్న అంశాలను తిరిగి తన పాఠశాలలో అమలు చేస్తూ స్థానిక పరిస్థితులకు అనుగుణంగా బోధనలో మార్పులు తీసుకొస్తున్నారు. గత ఏడాది కూడా జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారానికి భవాని పేరు ప్రతిపాదించారు. అయితే ఈసారి నిర్వహించిన ఇంటర్వ్యూల్లో తన బోధనా విధానం, విద్యార్థుల కోసం చేపడుతున్న కార్యక్రమాలు, విద్యారంగంలో చేసిన ప్రయోగాలను సమర్థంగా వివరించి తాజాగా నేషనల్ బెస్ట్ టీచర్ అవార్డుకు ఎంపికయ్యారు.


# ఆర్ఎఫ్‌సీఎల్ షట్‌డౌన్‌పై తుమ్మల ఆందోళన

**హైదరాబాద్, మహా:** ఖరీఫ్ సీజన్‌లో యూరియాకు డిమాండ్ పెరిగిన వేళ రామగుండం ఫెర్టిలైజర్స్ అండ్ కెమికల్స్ లిమిటెడ్ (ఆర్ఎఫ్‌సీఎల్)లో ఉత్పత్తి నిలిచి పోవడంపై వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆందోళన వ్యక్తం చేశారు. ఆగస్టు 22 నుంచి ప్రారంభమైన షట్‌డౌన్‌తో సుమారు పది రోజుల పాటు యూరియా ఉత్పత్తికి అంతరాయం ఏర్పడే అవకాశం ఉందని తెలిపారు. కేంద్రం తక్షణమే జోక్యం చేసుకుని ప్లాంట్‌ను వీలైనంత త్వరగా పునరుద్ధరించాలని మంత్రి కోరారు. షట్ డౌన్ సమయంలో రైతులకు కొరత రాకుండా ఇతర దేశీయ ఎరువుల కర్మాగారాల నుంచి అదనపు కేటాయింపులు చేయడంతో పాటు అవసరమైతే దిగుమతుల ద్వారా లోటును భర్తీ చేయాలని కేంద్ర మంత్రి జేపీ నడ్డాకు రాసిన లేఖలో విజ్ఞప్తి చేశారు. గత ఆర్థిక సంవత్సరంలోనూ సాంకేతిక సమస్యల కారణంగా ఆర్ఎఫ్‌సీఎల్ 112 రోజుల పాటు ఉత్పత్తికి దూరంగా ఉన్న విషయాన్ని తుమ్మల గుర్తుచేశారు. ఇలాంటి పరిస్థితులు మళ్లీ తలెత్తకుండా శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు. ఖరీఫ్ కీలక దశలో యూరియా సరఫరాలో అంతరాయం రాకుండా ముందస్తు నిల్వలు, ప్రత్యామ్నాయ సరఫరా మార్గాలపై దృష్టి పెట్టాలని సూచించారు.

# బీజేపీ కొత్త టీమ్‌తో ప్రధాని మోదీ భేటీ

**ఢిల్లీ, మహా :** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శనివారం ఢిల్లీలోని పార్టీ ప్రధాన కార్యాలయంలో బీజేపీ నూతన జాతీయ పదాధికారులతో సమావేశమయ్యారు. కొత్త ఆలోచనలు, దృక్పథాలతో పార్టీని మరింత బలోపేతం చేయాలని, ప్రజలతో పార్టీకి ఉన్న సంబంధాలను మరింతగా పెంచుకోవాలని ఈ సందర్భంగా ఆయన పిలుపునిచ్చారు. సంస్థాగత సమావేశాలు ఇలాంటి కొత్త ఆలోచనలకు వేదికగా నిలుస్తాయని ఆయన అభిప్రాయపడ్డారు. సమావేశం అనంతరం ప్రధాని మోదీ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ఎక్స్‌లో ఫొటోలను పంచుకున్నారు. "సంస్థాగత సమావేశాలు పార్టీని బలోపేతం చేయడానికి, ప్రజలతో సంబంధాలు పెంచుకోవడానికి కొత్త ఆలోచనలను అందిస్తాయి. కొత్త బృందంతో సమావేశం అద్భుతంగా జరిగింది," అని ఆయన పేర్కొన్నారు. పార్టీ కార్యాలయానికి విచ్చేసిన ప్రధానికి బీజేపీ అధ్యక్షుడు నితిన్ నబిన్ స్వాగతం పలికారు. ఈ వారం మొదట్లో ప్రకటించిన నితిన్ నబిన్ కొత్త జాతీయ బృందంతో ప్రధాని మోదీ భేటీ కావడం ఇదే తొలిసారి. కొత్తగా నియమించిన 65 మంది సభ్యుల బృందంలో 51 మంది కొత్త ముఖాలకు అవకాశం కల్పించారు. రాబోయే రోజుల్లో చేపట్టబోయే పలు సంస్థాగత, ప్రజా సంబంధ కార్యక్రమాలపై ఈ సమావేశంలో చర్చించారు. ముఖ్యంగా యువతతో మమేకం కావడమే లక్ష్యంగా 'యువ సంవాద్' కార్యక్రమానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని నిర్ణయించారు. 14 ఏళ్లు పైబడిన యువతను లక్ష్యంగా చేసుకుని ప్రత్యేక కార్యక్రమాలు రూపొందిస్తున్నారు. ఈ కార్యక్రమాల సమన్వయ బాధ్యతను భారతీయ జనతా యువమోర్చా కు అప్పగించారు.



# లండన్‌లో సీఎం రేవంత్‌రెడ్డి

( మొదటి పేజీ తరువాయి )

దక్షిణాసియా సీనియర్ ఇంటర్నేషనల్ రిలేషన్స్ మేనేజర్ రొసాన్నా గిల్లెస్పీతో రామకృష్ణారావు సమావేశమయ్యారు. హైదరాబాద్‌లో షార్ట్ టర్మ్ కోర్సులు, ఎగ్జిక్యూటివ్ ఎడ్యుకేషన్ కార్యక్రమాలు నిర్వహించే అవకాశాలను పరిశీలిస్తామని అమాండా తెలిపారు. పరిశోధన రంగంలో భాగస్వామ్యం విద్యార్థులు, అధ్యాపకుల మార్పిడి కార్యక్రమాలపై కూడా తెలంగాణతో కలిసి పనిచేసేందుకు ఆసక్తి చూపారు. డిసెంబరులో జరగనున్న ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌కు రావాలని ఇంపీరియల్ కాలేజీ ప్రతినిధులను రామకృష్ణారావు ఆహ్వానించారు.




**కేంద్రం ఉద్దేశపూర్వకంగానే అడ్డుకుంటోంది - ఖర్గే ఫైర్**

సీఎం రేవంత్ రెడ్డి లండన్ పర్యటన నేటితో పూర్తవనుంది. ఆయన అమెరికా పర్యటనకు కేంద్రం నో చెప్పడంతో లండన్ పర్యటన ముగించుకుని హైదరాబాద్‌కు చేరుకోనున్నారు. సీఎం రేవంత్ రెడ్డి అమెరికా పర్యటనకు కేంద్రం అనుమతి నిరాకరించడాన్ని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తీవ్రంగా తప్పుపట్టారు. పెట్టుబడుల కోసం వెళ్లే పర్యాటనలను అడ్డుకోవడం ముమ్మాటికీ అన్యాయమేనని ఆయన అభిప్రాయపడ్డారు. బీజేపీ పెద్దలు తమకు కావాల్సిన వారికి అనుమతి ఇస్తారని, తెలంగాణ సీఎంకు మాత్రం విదేశీ పర్యటనకు అనుమతి ఇవ్వలేదని ఆరోపించారు. అమెరికాలో తెలుగు రాష్ట్రాలకు చెందిన విద్యార్థులు పెద్ద సంఖ్యలో ఉన్నారని, పెట్టుబడులు వస్తే తెలంగాణతో పాటు దేశానికి కూడా లాభమేనన్నారు. కేంద్రం ఉద్దేశపూర్వకంగానే ఇలాంటి పర్యటనలను అడ్డుకుంటోందని ఖర్గే ఆరోపించారు. ముఖ్యమంత్రులు వెళ్లి పెట్టుబడులు తెస్తారనే భయం వారిలో ఉందన్నారు. అన్నీ తమ ద్వారా జరగాలనేది కేంద్రం సంకుచిత ఆలోచన అని ఖర్గే విమర్శించారు.

## ఇదేం ఆత్మనిర్భర్ భారత్?

( మొదటి పేజీ తరువాయి )

లేకుండా దిగుమతి చేసుకునే స్థాయికి మనం ఎలా చేరుకున్నాం?. ఇక రెండోది, మూడు నెలల్లో చక్కెర ధర దాదాపు 40 శాతం పెరిగింది. పండుగలకు ముందు ప్రజలపై ఇంత భారం మోపుతున్న ఈ ధరల పెరుగుదలకు ఎవరు బాధ్యులు? మూడోది, దేశంలో చక్కెర కొరత ఉన్నప్పుడు, ప్రభుత్వం విదేశాల నుంచి చక్కెరను దిగుమతి చేసుకుంటున్నప్పుడు, ఈ20 కోసం ఇథనాల్ ఉత్పత్తి చేయడానికి చెరకు, ధాన్యాన్ని మళ్లించే విధానాన్ని ఎందుకు సమీక్షించడం లేదు? ఇది ఎలాంటి 'ఆత్మనిర్భర్ భారత్'? అంటూ ఫైర్ అయ్యారు.

## కొండా సుస్మిత లైన్ దాటి ఆరోపణలు చేశారు

**టీపీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్**

**రాజగోపాల్ రెడ్డి హద్దుమీరలేదు**

**నిజామాబాద్, మహా :** మంత్రి కొండా సురేఖ కూతురు సుస్మిత సీఎం రేవంత్‌రెడ్డిపై చేసిన వ్యాఖ్యలను కాంగ్రెస్ హై కమాండ్ సీరియస్‌గా తీసుకుంది. ఈ క్రమంలోనే సుస్మిత వ్యాఖ్యల వీడియోను కాంగ్రెస్ క్రమశిక్షణ కమిటీ పరిశీలించింది. ఈ సందర్భంగా టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీకి నష్టం కలుగుతుంటే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. కొండా సుస్మిత లైన్ దాటి ఆరోపణలు చేశారని అన్నారు. అనిరుధ్, కోమటిరెడ్డి రాజ్‌గోపాల్‌రెడ్డి హద్దు మీరలేదని చెప్పారు. పార్టీ లైన్ ఎవరు దాటినా చర్యలు తప్పవని మహేశ్‌గౌడ్ పేర్కొన్నారు.

# పెట్టుబడులకు తెలంగాణే బెస్ట్ డెస్టినేషన్

**హైదరాబాద్, మహా :** తెలంగాణ రాష్ట్రాన్ని పెట్టుబడుల కేంద్రంగా ఎంచుకోవాలని ప్రపంచ వ్యాపార, పారిశ్రామిక వర్గాలకు నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం హైదరాబాద్‌లోని ఐటీసీ కోహినూర్‌లో నిర్వహించిన 'గ్లోబల్ బిజినెస్ ఎక్సలెన్స్ అండ్ లీడర్‌షిప్ కాన్‌క్లేవ్-2026'లో ఆయన ముఖ్య అతిథిగా ప్రసంగించారు. నైపుణ్యం కలిగిన మానవ వనరులు, ప్రపంచస్థాయి మౌలిక సదుపాయాలు, యువశక్తి, పారదర్శక పాలన అనే నాలుగు స్తంభాలపై తెలంగాణ పెట్టుబడుల గమ్యస్థానంగా ఎదుగుతోందని పేర్కొన్నారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం 'తెలంగాణ రైజింగ్-2047' విజన్ డాక్యుమెంట్‌తో ముందుకు సాగుతోందని మంత్రి తెలిపారు. 2034 నాటికి ఒక ట్రిలియన్ డాలర్లు, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక శక్తిగా రాష్ట్రాన్ని నిలపడమే లక్ష్యమన్నారు. 2025-26లో రాష్ట్ర జీఎస్‌డీపీ రూ.17.82 లక్షల కోట్లకు చేరుతుందని అంచనా వేస్తున్నామని, జాతీయ వృద్ధి రేటు 8 శాతంతో పోలిస్తే తెలంగాణ 10.7 శాతం వృద్ధి నమోదు చేయడం రాష్ట్ర ఆర్థిక పటిష్టతకు నిదర్శనమని వివరించారు.

# తెలంగాణలో భూ దందాలపై సమగ్ర విచారణ జరపాలి

- 22ఏ భూములపై సిట్టింగ్ జడ్జితో విచారణకు డిమాండ్
- ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలి
- సెప్టెంబరు 17న పరేడ్ గ్రౌండ్స్‌లో హైదరాబాద్ విమోచన దినోత్సవం.
- బాధితులకు బీజేపీ లీగల్ సెల్ అండ.
- కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్‌రెడ్డి.




**హైదరాబాద్, మహా :** తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత భూదందాలు, సెటిల్‌మెంట్లు పెరిగిపోయాయని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి, బీజేపీ నేత జి. కిషన్‌రెడ్డి తీవ్రస్థాయిలో ఆరోపించారు. 'భూభారతి' పేరుతో ప్రైవేటు భూములను 22ఏ నిషేధిత జాబితాలో చేర్చి సామాన్యులు, రైతులు, బిల్డర్లను ఇబ్బందులకు గురిచేస్తున్నారని విమర్శించారు. గత రెండుమూడేళ్లలో 22ఏ జాబితాలో చేర్చిన, తొలగించిన భూములపై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో సమగ్ర న్యాయ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఈ అంశంలో బాధితులకు మండల స్థాయి నుంచి హైకోర్టు వరకు బీజేపీ లీగల్ సెల్ ద్వారా ఉచిత న్యాయ సహాయం అందిస్తామని ప్రకటించారు. శనివారం హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో మీడియా సమావేశంలో కిషన్‌రెడ్డి మాట్లాడారు. 'ఇమ్రోజ్' పత్రిక సంపాదకుడు, నిజాం-రజాకార్ల అరాచకాలకు వ్యతిరేకంగా కలంతో పోరాడిన అమరవీరుడు షోయబుల్లాఖాన్ వర్ధంతి సందర్భంగా ఆయనకు నివాళులర్పించిన అనంతరం రాష్ట్రంలోని భూ వ్యవహారాలు, రేషన్ బియ్యం, ఫీజు రీయింబర్స్‌మెంట్, ఓటర్ల జాబితా, హైదరాబాద్ విమోచన దినోత్సవం తదితర అంశాలపై ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.

**22ఏ జాబితాపై న్యాయ విచారణ చేయాలి**

తెలంగాణలో భూముల వ్యవహారం అత్యంత సున్నితమైన అంశంగా మారిందని కిషన్‌రెడ్డి అన్నారు. గత బీఆర్ఎస్ పాలనలో ధరణి పేరుతో జరిగిన భూ అక్రమాలను అంతం చేస్తామని చెప్పిన కాంగ్రెస్.. ఇప్పుడు 'భూభారతి' పేరుతో మరింత తీవ్రమైన సమస్యలకు దారితీస్తోందని ఆరోపించారు. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాల్లో భారీగా ప్రైవేటు భూములను 22ఏ నిషేధిత జాబితాలో చేర్చారని, దీనిపై సమగ్ర విచారణ అవసరమని పేర్కొన్నారు.

ప్రభుత్వ, దేవాదాయ, ఇతర నిర్దిష్ట కేటగిరీలకు చెందిన భూములను చట్ట ప్రకారం నిషేధిత జాబితాలో ఉంచే నిబంధనలు ఉన్నప్పటికీ.. దశాబ్దాలుగా పట్టాలు, అనుమతులు, పన్నుల చెల్లింపులతో నివసిస్తున్న ప్రజల ఆస్తులు కూడా వివాదాల్లో చిక్కుతున్నాయని ఆయన ఆరోపించారు. ఈ ఆరోపణలపై అధికారికంగా సమగ్ర విచారణ జరిగి వాస్తవాలు వెలుగులోకి రావాల్సిన అవసరం ఉంది.

భూ రికార్డుల మార్పులు, 22ఏలో చేర్పులు, తొలగింపులు, రిజిస్ట్రేషన్లపై వచ్చే ఫిర్యాదులను పారదర్శకంగా పరిశీలించాల్సిందేనని కిషన్‌రెడ్డి అన్నారు. బాధితులు న్యాయం కోసం కోర్టుల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి రాకుండా ప్రభుత్వం స్పష్టమైన వ్యవస్థను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

**బాధితులకు బీజేపీ న్యాయ సహాయం**

భూముల సమస్యలతో బాధపడుతున్న రైతులు, సామాన్యులు, ఆస్తి యజమానులకు బీజేపీ లీగల్ సెల్ అండగా ఉంటుందని కిషన్‌రెడ్డి ప్రకటించారు. మండల స్థాయి అధికారుల నుంచి హైకోర్టు వరకు అవసరమైన న్యాయ సహాయం అందిస్తామని తెలిపారు. భూమి రికార్డులు డిజిటలైజ్ అవుతున్న కొద్దీ పారదర్శకత పెరగాల్సిన అవసరం ఉందని, ఒకరి ఆస్తిని మరొకరి పేరుతో మార్చడం, అనుమతుల విషయంలో అధికార దుర్వినియోగం, రాజకీయ ఒత్తిళ్లు వంటి ఆరోపణలకు తావులేకుండా వ్యవస్థ పనిచేయాలని ఆయన అన్నారు.

**రేషన్ బియ్యంపై కేంద్రం పేరు ఎందుకు లేదు?**

ప్రధానమంత్రి గరీబ్ కల్యాణ్ అన్న యోజన కింద పేదలకు అందుతున్న ఉచిత బియ్యం విషయంలోనూ కిషన్‌రెడ్డి తెలంగాణ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వం ధాన్యం కొనుగోలు, సబ్సిడీ, రవాణా తదితర అంశాల్లో భారీగా వ్యయం చేస్తోందని పేర్కొంటూ.. కేంద్ర పథకం ద్వారా అందుతున్న బియ్యాన్ని రాష్ట్ర ప్రభుత్వం తన పథకంగా ప్రచారం చేసుకోవడం సరికాదని విమర్శించారు.

రేషన్ కార్డులు, రశీదులు, పంపిణీ వ్యవస్థలో కేంద్రం పాత్రను స్పష్టంగా ప్రజలకు తెలియజేయాలని కోరారు. కేంద్ర పథకానికి సంబంధించిన గుర్తింపును తొలగించి రాష్ట్ర ప్రభుత్వానికి మాత్రమే ప్రచారం కల్పించడం సముచితం కాదని అన్నారు. కేంద్ర పథకం ప్రయోజనాలు లబ్ధిదారులకు నేరుగా చేరేలా అవసరమైతే ప్రత్యామ్నాయ విధానాలను పరిశీలిస్తామని హెచ్చరించారు.

**రూ.15 వేల కోట్ల ఫీజు బకాయిలు చెల్లించాలి**

తెలంగాణలో విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విద్యా వ్యవస్థను సంక్షోభంలోకి నెట్టాయని కిషన్‌రెడ్డి ఆరోపించారు. కళాశాలలకు ప్రభుత్వం చెల్లించాల్సిన బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.ఫీజులు అందక కొన్ని ప్రైవేటు విద్యాసంస్థలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని, చదువు పూర్తిచేసిన విద్యార్థులకు ధ్రువపత్రాలు ఇవ్వకపోవడంతో ఉన్నత విద్య, ఉద్యోగ అవకాశాల విషయంలో ఇబ్బందులు తలెత్తుతున్నాయని అన్నారు. ఎన్నికల సమయంలో హామీ ఇచ్చిన విద్యా భరోసా కార్డు, విద్యార్థినులకు స్కూటీల వంటి హామీల అమలుపైనా ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

**ఓటర్ల జాబితా శుద్ధిపై సీఎం వ్యాఖ్యలను తప్పుబట్టిన కిషన్‌రెడ్డి**

ఓటర్ల జాబితా సవరణ, శుద్ధి కేంద్ర ఎన్నికల సంఘం నిర్వహించే రాజ్యాంగబద్ధ ప్రక్రియ అని కిషన్‌రెడ్డి అన్నారు. ఒక వ్యక్తికి ఒకే ఓటు ఉండాలన్న ప్రాథమిక సూత్రానికి అనుగుణంగా డబుల్ ఎంట్రీలు, మరణించిన వ్యక్తుల పేర్లు, ఇతర తప్పులను తొలగించడం ఎన్నికల సంఘం బాధ్యత అని పేర్కొన్నారు.

ఈ ప్రక్రియను రాజకీయంగా చూడటం సరికాదన్నారు. ఓటర్ల జాబితా మార్పుల పేరుతో ప్రజల్లో భయాందోళనలు సృష్టించడం తగదని సీఎం రేవంత్‌రెడ్డిపై విమర్శలు చేశారు. ఎన్నికల జాబితా సవరణలో బూత్ స్థాయి అధికారులు, రాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగం కూడా భాగస్వాములేనని.. అలాంటి ప్రక్రియకు కేంద్రాన్ని మాత్రమే బాధ్యుడిని చేయడం సరికాదన్నారు.

**విదేశీ పర్యటనలపై రాజకీయాలు వద్దు**

ముఖ్యమంత్రి, మంత్రుల అధికారిక విదేశీ పర్యటనలకు కేంద్రంలోని విదేశాంగ మంత్రిత్వశాఖ నుంచి అనుమతులు తీసుకోవడం సాధారణ ప్రక్రియ అని కిషన్‌రెడ్డి తెలిపారు. భద్రత, దౌత్యపరమైన అంశాలు, సంబంధిత దేశాలతో సమన్వయం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని నిర్ణయాలు ఉంటాయని చెప్పారు.కేంద్రం అనుమతి ఇవ్వలేదనే అంశాన్ని రాజకీయ వివాదంగా మార్చడం తగదన్నారు. గతంలో వివిధ ప్రభుత్వాల సమయంలో కూడా అధికారిక పర్యటనలకు అనుమతులు ఆలస్యమైన లేదా లభించని సందర్భాలు ఉన్నాయని గుర్తుచేశారు.

**కాంగ్రెస్ చరిత్రపై తీవ్ర విమర్శలు**

ప్రస్తుత రాజకీయ పరిణామాలపై స్పందిస్తూ కాంగ్రెస్ పార్టీ గత చరిత్రను కూడా కిషన్‌రెడ్డి ప్రస్తావించారు. తెలంగాణ ఉద్యమాలు, విద్యార్థుల ఆందోళనలపై కాంగ్రెస్ నాయకులు మాట్లాడే ముందు గతంలో జరిగిన ఘటనలను గుర్తు చేసుకోవాలని అన్నారు. పార్లమెంట్ వద్ద ఇటీవల జరిగిన నిరసనల్లో ఢిల్లీ పోలీసులు సంయమనంతో వ్యవహరించారని, బాధ్యతగల ప్రతిపక్ష నాయకులు యువతను రెచ్చగొట్టే విధంగా మాట్లాడకూడదని రాహుల్‌గాంధీని ఉద్దేశించి విమర్శించారు.ప్రధాని నరేంద్ర మోదీ, ఆయన కుటుంబ సభ్యులపై అభ్యంతరకర వ్యాఖ్యలు చేసిన సందర్భాల్లోనూ ప్రభుత్వం వ్యవహరించిన తీరును కిషన్‌రెడ్డి ప్రస్తావించారు. రాజకీయ ప్రత్యర్థులపై విమర్శలు ఉన్నప్పటికీ వ్యక్తిగత దూషణలకు దూరంగా ఉండాలని సూచించారు.

**సెప్టెంబరు 17న పరేడ్ గ్రౌండ్స్‌లో విమోచన దినోత్సవం**

హైదరాబాద్ సంస్థానం భారత యూనియన్‌లో విలీనమైన సెప్టెంబరు 17, 1948 రోజును పురస్కరించుకుని ఈ ఏడాది కూడా సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో హైదరాబాద్ విమోచన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించనున్నట్లు కిషన్‌రెడ్డి తెలిపారు.హైదరాబాద్ సంస్థానం 1948 సెప్టెంబరు 17న భారత యూనియన్‌లో విలీనమైంది. నిజాం పాలనకు ముగింపు పలికిన ఆ పరిణామాన్ని కేంద్ర ప్రభుత్వం 2022 నుంచి అధికారికంగా హైదరాబాద్ విమోచన దినోత్సవంగా నిర్వహిస్తోంది. 2025లోనూ పరేడ్ గ్రౌండ్స్‌లో కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించగా రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు.

ఈ ఏడాది కూడా పరేడ్, సాంస్కృతిక కార్యక్రమాలతో వేడుకలను నిర్వహించనున్నట్లు కిషన్‌రెడ్డి వెల్లడించారు. మహారాష్ట్రలో 'మరాఠ్వాడా విమోచన దినోత్సవం', కర్ణాటకలో హైదరాబాద్-కర్ణాటక ప్రాంత విమోచన దినోత్సవం పేరుతో కార్యక్రమాలు జరుగుతున్నాయని, తెలంగాణలోనూ చారిత్రక అంశాలను అధికారికంగా గుర్తించాలని ఆయన కోరారు. అయితే సెప్టెంబరు 17ను ఏ పేరుతో, ఏ రూపంలో నిర్వహించాలన్న అంశంపై తెలంగాణలో రాజకీయ భిన్నాభిప్రాయాలు కొనసాగుతున్నాయి. గతంలో రాష్ట్ర ప్రభుత్వం 'తెలంగాణ జాతీయ సమైక్యతా దినోత్సవం'గా, కాంగ్రెస్ ప్రభుత్వం 'ప్రజాపాలన దినోత్సవం'గా నిర్వహించింది. కేంద్రం మాత్రం 'హైదరాబాద్ విమోచన దినోత్సవం'గా కార్యక్రమం నిర్వహిస్తోంది. షోయబుల్లా ఖాన్ త్యాగాన్ని గుర్తుచేసుకున్న కిషన్‌రెడ్డిరజాకార్ల అరాచకాలు, నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా జర్నలిజం ద్వారా పోరాడిన షోయబుల్లా ఖాన్ త్యాగాన్ని కిషన్‌రెడ్డి గుర్తుచేశారు. 'ఇమ్రోజ్' పత్రిక ద్వారా హైదరాబాద్ భారత యూనియన్‌లో విలీనం కావాలన్న ఆకాంక్షకు ఆయన మద్దతు ఇచ్చారని పేర్కొన్నారు.చరిత్రలో షోయబుల్లా ఖాన్ పాత్రకు ప్రత్యేక స్థానం ఉందని పలు చారిత్రక ఆధారాలు పేర్కొంటున్నాయి. 1948 ఆగస్టు 22న రజాకార్ల చేతిలో ఆయన హత్యకు గురయ్యారని చారిత్రక రికార్డులు, కిషన్‌రెడ్డి గతంలో రాసిన వ్యాసాలు కూడా పేర్కొన్నాయి. హైదరాబాద్ విమోచన పోరాటంలో వివిధ వర్గాలకు చెందిన ప్రజలు, జర్నలిస్టులు, సామాజిక కార్యకర్తలు చేసిన త్యాగాలను భవిష్యత్ తరాలకు తెలియజేయాల్సిన అవసరం ఉందని కిషన్‌రెడ్డి అన్నారు.

# మెట్రో రెండోదశలో భూగర్భ మార్గాలు

- విమానాశ్రయాలు, రైల్వే ట్రాక్‌ల వద్ద ప్రత్యేక డిజైన్
- రూ.38,595 కోట్లతో మెట్రో రెండోదశ



**హైదరాబాద్, మహా :** హైదరాబాద్ మెట్రో రైలు రెండోదశ విస్తరణలో ఇంజినీరింగ్ పరంగా పలు క్లిష్టమైన సవాళ్లను అధిగమించేలా ప్రత్యేక డిజైన్లు రూపొందిస్తున్నారు. రైల్వే ట్రాక్‌లు, జాతీయ రహదారులు, హైటెన్షన్ విద్యుత్ లైన్లు, ఎయిర్‌పోర్టు ప్రాంగణాలు ఉన్న ప్రాంతాల్లో మెట్రో నిర్మాణానికి అనేక అనుమతులు, సాంకేతిక పరిష్కారాలు అవసరం కానున్నాయి. ఈ నేపథ్యంలో రన్‌వే కార్యకలాపాలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా హకీంపేట విమానాశ్రయం వద్ద భూగర్భ మెట్రో మార్గాన్ని ప్రతిపాదించారు.జేబీఎస్-శామీర్‌పేట కారిడార్‌లో హకీంపేట విమానాశ్రయం సమీపంలో సుమారు 1.65 కిలోమీటర్ల మెట్రో మార్గాన్ని అండర్‌గ్రౌండ్‌లో నిర్మించాలని ప్రతిపాదించారు. హెచ్ఎండీఏ ప్రతిపాదించిన హైవే టన్నెల్ వెంట ఈ మార్గాన్ని తీసుకెళ్లేలా ప్రణాళిక రూపొందించారు. దీంతో విమానాశ్రయ రన్‌వేకు సంబంధించిన పరిమితులను అధిగమించడంతో పాటు భద్రతా ప్రమాణాలను పాటించే అవకాశం ఉంటుంది. నాగోల్-శంషాబాద్ కారిడార్‌లో విమానాశ్రయ పరిధిలో సుమారు 1.6 కిలోమీటర్ల మేర భూగర్భ మెట్రో ప్రతిపాదించారు. విమానాశ్రయ కార్యకలాపాలకు అంతరాయం కలగకుండా ఈ మార్గాన్ని డిజైన్ చేయనున్నారు. శంషాబాద్ విమానాశ్రయం వరకు మెట్రోను విస్తరించే ప్రణాళికలో కార్గో, ఎయిర్‌పోర్ట్ స్టేషన్లతో పాటు విమానాశ్రయ ప్రాంగణంలోనే మెట్రో డిపో ఏర్పాటుకు ప్రతిపాదనలు ఉన్నాయి. దీనికి పౌర విమానయాన మంత్రిత్వశాఖ అనుమతి తప్పనిసరి. బేగంపేట విమానాశ్రయం రన్‌వే కారణంగా చుట్టుపక్కల ప్రాంతాల్లో ఎత్తు పరిమితులు అమల్లో ఉన్నాయి. విమానాల రాకపోకలకు అవసరమైన ఫన్నెల్ జోన్ నిబంధనలను దృష్టిలో పెట్టుకుని శామీర్‌పేట, మేడ్చల్ కారిడార్లను తక్కువ ఎత్తులో నిర్మించేలా డిజైన్ చేశారు. ఇందుకు సంబంధిత అనుమతుల కోసం అధికారులు చర్యలు చేపడుతున్నారు. రెండోదశలో రైల్వే క్రాసింగ్‌లు కూడా కీలక సవాలుగా మారనున్నాయి. ఫలక్‌నుమా, ఆరాంఘర్, శంషాబాద్, గుండ్లపోచంపల్లి, లోతుకుంట, అల్వాల్ ప్రాంతాల్లో మెట్రో మార్గం రైల్వే ట్రాక్‌లను దాటాల్సి ఉంటుంది. ఈ మార్గాలకు దక్షిణ మధ్య రైల్వే నుంచి సూత్రప్రాయంగా అనుమతి లభించినట్లు అధికారులు తెలిపారు. సుచిత్ర ప్రాంతంలో మాత్రం సంబంధిత అనుమతి ఇంకా అవసరం ఉంది. జాతీయ రహదారుల వెంట కూడా మెట్రో నిర్మాణానికి రైట్ ఆఫ్ వే అనుమతులు కీలకం కానున్నాయి. మదీనాగూడ-పటాన్‌చెరు, చింతలకుంట-హయత్‌నగర్ మార్గాల్లో ఎన్‌హెచ్ 65, ఆరాంఘర్-శంషాబాద్, బోయిన్‌పల్లి-మేడ్చల్ మార్గాల్లో ఎన్‌హెచ్ 44 పరిధిలో మెట్రో స్తంభాల నిర్మాణానికి కేంద్ర రహదారులు, జాతీయ రహదారుల శాఖ అనుమతులు అవసరం. మొత్తంగా రెండోదశలో 7 కారిడార్లలో 122.9 కిలోమీటర్ల మెట్రో మార్గం, 86 స్టేషన్లు ప్రతిపాదించారు. ప్రాజెక్టు అంచనా వ్యయం రూ.38,595 కోట్లు కాగా.. పూర్తిస్థాయిలో అందుబాటులోకి వచ్చిన తర్వాత రోజుకు సుమారు 12.42 లక్షల మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తారని అంచనా. ప్రాజెక్టు నిధుల్లో కేంద్రం వాటా రూ.6,666 కోట్లు, రాష్ట్రం వాటా రూ.11,933 కోట్లు, రుణాల ద్వారా రూ.19,996 కోట్లు సమీకరించే ప్రతిపాదన ఉంది. రెండోదశలో జీహెచ్ఎంసీ పరిధిలో 36.5 కి.మీ., మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 24.9 కి.మీ., సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 41.3 కి.మీ. మేర మెట్రో విస్తరించనుంది. హెచ్ఎండీఏ, కంటోన్మెంట్ బోర్డు పరిధిలో రైట్ ఆఫ్ వే అనుమతులు కూడా త్వరగా ఇవ్వాలని మెట్రో అధికారులు కోరుతున్నారు. ఈ అనుమతుల ప్రక్రియ పూర్తయితే నగర రవాణా వ్యవస్థలో రెండోదశ కీలక మలుపుగా మారే అవకాశం ఉంది.

# గచ్చిబౌలిలో అక్రమ భవనాలపై హైడ్రా ఉక్కుపాదం

( మొదటి పేజీ తరువాయి )

సిబ్బంది, ఎన్డీఆర్ఎఫ్ బృందాలు ఘటనా స్థలాని కి చేరుకుని సహాయక చర్యలు చేపట్టాయి. శిథిలాల తొలగింపులో ఇద్దరి మృతదేహాలను వెలికితీశారు. మరో వ్యక్తికి గాయాలైనట్లు అధికారులు వెల్లడించారు. శిథిలాల కింద మరెవరైనా చిక్కుకున్నారేమోనన్న అనుమానంతో రెస్క్యూ బృందాలు సుదీర్ఘంగా గాలింపు చేపట్టాయి. శిథిలాలు పక్కనున్న అపార్ట్‌మెంట్‌పై పడటంతో అక్కడి పలు ఫ్లాట్లు దెబ్బతిన్నాయని, సమీప హాస్టల్‌లోని విద్యార్థులు భయంతో బయటకు పరుగులు తీశారని పలు వార్తా సంస్థలు పేర్కొన్నాయి.

**50 గజాల్లో ఏడంతస్తుల నిర్మాణమా?**

ఘటనాస్థలాన్ని పరిశీలించిన హైడ్రా కమిషనర్ రంగనాథ్ నిర్మాణ తీరుపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. కేవలం 50 గజాల స్థలంలో ఏడంతస్తుల భవనం నిర్మించడంతోపాటు పైభాగంలో అదనంగా పెంట్‌హౌస్‌ను కూడా నిర్మించినట్లు ప్రాథమిక పరిశీలనలో తేలిందని ఆయన తెలిపారు. నాలాను ఆనుకుని ఉన్న ఇంత చిన్న స్థలంలో బహుళ అంతస్తుల నిర్మాణం చేపట్టడం, అవసరమైన సెట్‌బ్యాక్‌లు పాటించకపోవడం, నిర్మాణ నిబంధనలను ఉల్లంఘించడం వంటి అంశాలు అధికారుల దృష్టికి వచ్చాయి. అయితే భవనం కూలిపోవడానికి ఇదే తుది కారణమని ఇప్పుడే నిర్ధారించడం కంటే, నిర్మాణ అనుమతులు, ప్లాన్ ఆమోదాలు, పునాది సామర్థ్యం, నిర్మాణ నాణ్యత, సెట్‌బ్యాక్‌లు, నాలా పరిధి, అదనపు అంతస్తుల నిర్మాణం వంటి అన్ని అంశాలపై సాంకేతిక దర్యాప్తు జరగాల్సి ఉంది. ప్రమాదానికి అసలు కారణాలను అధికారిక విచారణ స్పష్టం చేయాల్సి ఉంటుంది. ప్రస్తుతం అధికారులు మాత్రం నిర్మాణంలో తీవ్ర నిబంధనల ఉల్లంఘనలున్నట్లు ప్రాథమికంగా చెబుతున్నారు.

**'సాజిద్ భవనాలన్నీ ఇలాగే'.. స్థానికుల ఫిర్యాదులు**

ఘటనా స్థలంలో స్థానికులతో మాట్లాడిన రంగనాథ్‌కు బిల్డర్ సాజిద్ నిర్మిస్తున్న ఇతర భవనాలపైనా ఫిర్యాదులు వచ్చినట్లు తెలిపారు. ఆయన నిర్మించిన భవనాలు కూడా నిబంధనలకు విరుద్ధంగా, నాసిరకం నిర్మాణాలతో ఉన్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారని రంగనాథ్ పేర్కొన్నారు. ఈ ఆరోపణలపై అధికారులు భవనాల వారీగా పరిశీలన చేసి, అనుమతులు, నిర్మాణ నాణ్యత, భద్రతా ప్రమాణాలను తనిఖీ చేయాల్సిన అవసరం ఉంది. ఇలాంటి ఆరోపణలు నిజమని తేలితే సంబంధిత నిర్మాణాలపై కూడా చర్యలు తీసుకుంటామని హైడ్రా స్పష్టం చేసింది.




## హైడ్రా చర్యలకు చట్టబద్ధతే కీలకం

అయితే అక్రమ నిర్మాణాలపై కఠిన చర్యలు తీసుకోవాలన్న డిమాండ్‌తోపాటు, కూల్చివేతలు చట్టబద్ధమైన ప్రక్రియను అనుసరించేలా చూడాలన్న అంశం కూడా కీలకంగా మారింది. ఇటీవలే తెలంగాణ హైకోర్టు హైడ్రా చర్యల్లో విధివిధానాలు, న్యాయస్థానాల ఆదేశాల అమలుపై తీవ్ర వ్యాఖ్యలు చేసింది. కొన్ని కేసుల్లో కోర్టు ఆదేశాలను ఉల్లంఘించినట్లు వచ్చిన ఆరోపణల నేపథ్యంలో హైడ్రా కమిషనర్‌పై న్యాయపరమైన వివాదాలు కూడా కొనసాగుతున్నాయి. అందువల్ల అంజయ్యనగర్‌లో చేపట్టబోయే ప్రత్యేక డ్రైవ్‌లో నిర్మాణాల చట్టబద్ధతను రికార్డుల ఆధారంగా నిర్ధారించడం, సంబంధిత యజమానులకు నోటీసులు, అభ్యంతరాల పరిశీలన, కోర్టు ఆదేశాల అమలు వంటి న్యాయపరమైన అంశాలను పక్కాగా పాటించడం అత్యంత కీలకం. అక్రమ నిర్మాణాలపై చర్యలు ఎంత కఠినంగా ఉండాలో, అదే స్థాయిలో అవి పారదర్శకంగా, చట్టబద్ధంగా ఉండాలన్నది ఈ ఘటన మరోసారి గుర్తుచేస్తోంది. హైడ్రా గత చర్యలపై కోర్టుల్లో వచ్చిన అభ్యంతరాల నేపథ్యంలో ఈసారి చేపట్టే చర్యలపై మరింత న్యాయపరమైన జాగ్రత్తలు తప్పనిసరిగా మారాయి.

**అంజయ్యనగర్‌లో మరిన్ని అక్రమ కట్టడాలున్నాయా?**

ఈ ఘటనతో అంజయ్యనగర్‌లోని ఇతర బహుళ అంతస్తుల భవనాల నిర్మాణాలపై కూడా ప్రశ్నలు తలెత్తాయి. నాలాలపై, నాలాలను ఆనుకుని, తగిన సెట్‌బ్యాక్‌లు లేకుండా నిర్మించిన భవనాలు ఈ ప్రాంతంలో అనేకం ఉన్నాయని రంగనాథ్ తెలిపారు. వాటిలో కొన్ని ప్రస్తుతం హాస్టళ్లుగా వినియోగిస్తున్నట్లు చెప్పారు. ప్రమాదకర స్థితిలో ఉన్న భవనాలను వెంటనే ఖాళీ చేయాలని యజమానులను ఆదేశించారు. ప్రాణాలకు ముప్పు కలిగించే స్థాయిలో భవనాలు ఉన్నట్లయితే వాటిలో నివసించే వారిని ముందుగా సురక్షిత ప్రాంతాలకు తరలించడమే ప్రాధాన్యమని అధికారులు సూచిస్తున్నారు. అంజయ్యనగర్‌లో ప్రత్యేక తనిఖీ, ఆక్రమణల గుర్తింపు, నిర్మాణ అనుమతుల పరిశీలన, ప్రమాదకర భవనాల గుర్తింపు వంటి చర్యలతో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించనున్నట్లు రంగనాథ్ ప్రకటించారు. నిబంధనలను ఉల్లంఘించిన నిర్మాణాలను ఉపేక్షించేది లేదని, అవసరమైన చోట కూల్చివేతలు చేపడతామని స్పష్టం చేశారు. దీంతో ప్రమాదం జరిగిన ప్రాంతంలోనే కాకుండా చుట్టుపక్కల ఉన్న బహుళ అంతస్తుల భవనాల యజమానుల్లోనూ ఆందోళన మొదలైంది.

**నాలాల ఆక్రమణలపై మరోసారి దృష్టి**

గచ్చిబౌలి ఘటన మరోసారి హైదరాబాద్‌లో నాలాల ఆక్రమణలు, అక్రమ నిర్మాణాల సమస్యను తెరపైకి తెచ్చింది. నాలాల ప్రవాహ మార్గాలను కట్టడాలతో కుదించడం వల్ల వర్షపు నీటి ప్రవాహానికి ఆటంకం ఏర్పడటమే కాకుండా, భారీ వర్షాల సమయంలో వరద ముప్పు పెరుగుతుంది. హైదరాబాద్‌లో నాలాల ఆక్రమణల తొలగింపు, నీటి ప్రవాహ మార్గాల పునరుద్ధరణను హైడ్రా గతంలోనూ తన ప్రధాన లక్ష్యాల్లో ఒకటిగా పేర్కొంది. గతంలోనూ నాలాలపై, నీటి ప్రవాహ మార్గాల్లో నిర్మించిన అక్రమ కట్టడాలను హైడ్రా తొలగించింది. రామ్నగర్‌లో నాలా, రహదారిని ఆక్రమించి నిర్మించిన నిర్మాణాలపై చర్యలు తీసుకున్న సందర్భంలో స్థానికుల ఫిర్యాదుల ఆధారంగా పరిశీలన చేసి కూల్చివేతలు చేపట్టినట్లు నమోదైంది. అలాగే పట్నీ ప్రాంతంలో నాలా వెడల్పును అక్రమ నిర్మాణాలు గణనీయంగా తగ్గించడంతో వర్షపు నీటి ప్రవాహానికి ఆటంకం ఏర్పడిన నేపథ్యంలో ఆక్రమణలు తొలగించిన ఉదాహరణలున్నాయి.

## బిల్డర్ బాధ్యత నుంచి అధికారుల పర్యవేక్షణ వరకు

ఒక చిన్న స్థలంలో భారీ బహుళ అంతస్తుల భవనం ఎలా నిర్మాణ దశకు చేరుకుంది? నిర్మాణానికి అనుమతులు ఉన్నాయా? అనుమతి ఉంటే ఎన్ని అంతస్తులకు ఉంది? వాస్తవంగా ఎన్ని అంతస్తులు నిర్మించారు? నాలా పరిధిలో నిర్మాణం చేపట్టేందుకు ఎవరు అనుమతించారు? నిర్మాణ సమయంలో సంబంధిత అధికారులు తనిఖీలు చేశారా? భవనం నిర్మాణ నాణ్యతను ఎవరు పర్యవేక్షించారు? అనే ప్రశ్నలకు సమాధానాలు రావాల్సి ఉంది. ఇద్దరు కార్మికుల ప్రాణాలను బలిగొన్న ఈ ఘటనను కేవలం ఒక భవనం కూలిన ప్రమాదంగా చూడకుండా, హైదరాబాద్‌లో పెరుగుతున్న అనధికార బహుళ అంతస్తుల నిర్మాణాలపై సమగ్ర సమీక్షకు అవకాశంగా మార్చాల్సిన అవసరం ఉంది. ముఖ్యంగా నాలాలు, నీటి ప్రవాహ మార్గాలు, ఇరుకైన స్థలాలు, అధిక అంతస్తుల నిర్మాణాలు, హాస్టళ్లుగా మారిన అనధికార భవనాలపై ప్రత్యేక భద్రతా ఆడిట్ నిర్వహించాలన్న డిమాండ్ బలపడుతోంది.



# సంస్కృతి సాంప్రదాయానికి ప్రతీక శిశు మందిరాల విద్యా

- ఆకట్టుకున్న గణిత విజ్ఞాన మేళ

**మంచిర్యాల, మహా** : సంస్కృతి సాంప్రదాయానికి ప్రతీక శిశు మందిరాల విద్య అని మంచిర్యాల జిల్లా మాజీ డిసిసి అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ ప్రేమ్ సాగర్ రావు, మంచిర్యాల మున్సిపల్ మేయర్ ధరణి మధుకర్ లు అన్నారు. శనివారం మంచిర్యాల సరస్వతి శిశు మందిర్ పాఠశాలలో విభాగ స్థాయిలో నిర్వహించిన గణిత విజ్ఞానమేలకు ముఖ్య అతిథులుగా వారు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రీ సరస్వతీ విద్యాపీఠం తెలంగాణ విభాగ్ స్థాయి గణిత విజ్ఞాన సంస్కృతి మహోత్సవం కార్యక్రమంలో విభాగ స్థాయిలోని 9 పాఠశాలలకు చెందిన సరస్వతి శిశు మందిరాల నుండి 287 మంది విద్యార్థులు, ప్రబంధ కారిణి పాల్గొని తమ గణిత విజ్ఞాన ప్రదర్శనను ప్రదర్శించి అందర్నీ ఆకట్టుకుందని అన్నారు. విద్యార్థుల్లో గణితంపై ఆసక్తిని పెంపొందించడంతో పాటు, గణిత శాస్త్రంలోని అంశాలపై అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారని వెల్లడించారు. అనంతరం ఉపాధ్యాయులు మాట్లాడుతూ గణితం కేవలం పాఠ్యాంశం మాత్రమే కాకుండా, నిత్యజీవితంలో ప్రతి ఒక్కరికీ ఉపయోగపడే ముఖ్యమైన శాస్త్రమని తెలిపారు. విద్యార్థులు గణితంపై భయాన్ని వీడి, ఆసక్తితో సాధన చేయడం ద్వారా ఉన్నత ఫలితాలను సాధించవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఈఓ సత్తయ్య, జిల్లా సైన్స్ అధికారి రాజగోపాల్ రావు, ఎంఈఓ మాళవిక దేవి, కార్పొరేటర్లు షేర్ లక్ష్మీ పవన్, చిలువేరు జ్యోతి, సుధమల్ల హరికృష్ణ, విభాగ్ అధ్యక్షులు డాక్టర్ విష్ణువర్ధన్ రావు, కార్యదర్శి దహగాం గోవిందరావు, ఉపాధ్యక్షులు సదాశివ్, సహకార్యదర్శి గుండం అశోక్, కార్యక్రమ నిర్వాహకులు పాఠశాల అధ్యక్షులు చందూరి మహేందర్, కార్యదర్శి గుండా సుధాకర్, కోశాధికారి కొమ్మెర విశ్వేశ్వర శర్మ, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రజిని తోపాటు పలువురు పాల్గొన్నారు.





# ముగిసిన ఎస్ఎల్ గౌడ్ అంత్యక్రియలు

- పాడె మోసిన కవ్వంపల్లి,సత్తు
- తరలివచ్చిన అశేష జనం
- శోకసంద్రంగా మారిన మన్నెంపల్లి
- కన్నీటితో వీడ్కోలు పలికిన కాంగ్రెస్ శ్రేణులు

**కరీంనగర్ మహా** : కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం మన్నెంపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, బ్లాక్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు సుధాగోని లక్ష్మీనారాయణ గౌడ్ (ఎస్ఎల్ గౌడ్) అంత్యక్రియలు శనివారం ఆయన స్వగ్రామంలో అశ్రునయనాల మధ్య ముగిశాయి. ఆయన అంతిమ యాత్రకు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. టీపీసీసీ ఎస్సీ సెల్ చైర్మన్, మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ, జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేశం తదితరులు ఎస్ఎల్ గౌడ్ భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అంతిమయాత్రలో ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ స్వయంగా పాడె మోశారు. అంతిమయాత్రలో చివరి వరకు పాల్గొని ఎస్ఎల్ గౌడ్‌కు కన్నీటితో కడపటి వీడ్కోలు పలికారు. ఈ అంతిమ యాత్రలో చొప్పదండి మాజీ ఎమ్మెల్యే కొండూరు సత్యనారాయణ గౌడ్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బండారి రమేష్, ధ్యావ శ్రీనివాస్ రెడ్డి, బండారి తిరుపతి, బొద్దు సునీల్, లింగాల శ్రీనివాస్, డీసీసీ ఉపాధ్యక్షులు కోమటిరెడ్డి పద్మాకర్ రెడ్డి, నందగిరి రవీంద్రచారి, ప్రధాన కార్యదర్శి ముసుకు ఉపేందర్ రెడ్డి, దావు సంపత్ రెడ్డి, సహకార సంఘాల చైర్మన్లు మోరపల్లి రమణారెడ్డి, గోపు మల్లారెడ్డి, ఒగ్గు దామోదర్, ముద్దసాని శ్రీనివాస్ రెడ్డి, నాగిశెట్టి రాజయ్య, రొంటాల లక్ష్మారెడ్డి, కీసర సంపత్, గాజుల మహేష్, ఆత్మ కమిటీ చైర్మన్ చెన్నబోయిన రవి, పార్టీ నాయకులు పొట్ట శ్రీనివాస్, పోతుగంటి శ్రీనివాస్, టి.కిరణ్,మేడి అంజయ్య,జె.సంపత్, టి.కొమురయ్య, తుమ్మనపల్లి శ్రీనివాసరావు, కుంట రాజేందర్ రెడ్డి, శ్రీగిరి రంగారావు, మామిడి అనిల్ కుమార్, పులి కృష్ణ, మర్రి ఓదెలు యాదవ్,బుధారపు శ్రీనివాస్, కందుల అశోక్ రెడ్డి, నాంపల్లి తిరుపతి, పులి ఆంజనేయులు, పొన్నం సత్యనారాయణ గౌడ్, పొన్నం రవిచంద్ర,కటకం వెంకటరమణ, పదాల శంకరయ్య, చెప్యాల శ్రీనివాస్ గౌడ్,మాచర్ల అంజయ్య, గొట్టిముక్కుల సంపత్ రెడ్డి, పోలు రాము, రమేష్, రెడ్డిగాని రాజు,రాములు యాదవ్, మన్మోహన్ రావు, రేవెల్లి రాజలింగం,కొరివి అరుణ్ కుమార్, బుర్ర శ్రీధర్ గౌడ్ తోపాటు వివిధ గ్రామాల్లో సర్పంచులు, పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు,నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# డీఎస్సీపై జగన్‌కు లోకేశ్ ఐదో సవాల్

- 'టైమ్, డేట్ నువ్వే ఫిక్స్ చెయ్.
- చర్చకు నేను సిద్ధం'.
- విజయనగరం టీడీపీ కార్యకర్తల సమావేశంలో మంత్రి నారా లోకేశ్ పిలుపు.



**విజయనగరం, మహా** : డీఎస్సీ అంశంపై వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఆంధ్రప్రదేశ్ విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ మరోసారి సవాల్ విసిరారు. డీఎస్సీపై తనతో బహిరంగ చర్చకు రావాలని జగన్‌ను కోరుతూ ఇప్పటికే పలుమార్లు సవాల్ చేసిన లోకేశ్.. శనివారం విజయనగరంలో మరోసారి అదే అంశాన్ని ప్రస్తావించారు. 'టైమ్, డేట్ నువ్వే ఫిక్స్ చెయ్.. చర్చకు నేను సిద్ధం' అంటూ జగన్‌కు ఐదోసారి సవాల్ విసిరారు. డీఎస్సీ నియామకాలు, ఉపాధ్యాయ పోస్టులు, గత ప్రభుత్వ హయాంలో నియామక ప్రక్రియపై ఉన్న సందేహాలపై బహిరంగంగా చర్చించేందుకు తాను సిద్ధంగా ఉన్నానని స్పష్టం చేశారు. విజయనగరం నియోజకవర్గ టీడీపీ కార్యకర్తల సమావేశంలో పాల్గొన్న లోకేశ్.. పార్టీ బలోపేతం, ప్రభుత్వ కార్యక్రమాలు, ఉత్తరాంధ్ర అభివృద్ధి, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీ శ్రేణుల సన్నద్ధత తదితర అంశాలపై కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని, క్షేత్రస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయాలని సూచించారు.

**కార్యకర్తలే టీడీపీకి వెన్నెముక**

తెలుగుదేశం పార్టీకి కార్యకర్తలే అసలైన బలమని లోకేశ్ అన్నారు. పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు అండగా నిలిచిన కార్యకర్తలను ఎప్పటికీ మరచిపోమని స్పష్టం చేశారు. కష్టపడి పనిచేసే ప్రతి కార్యకర్తకు సముచిత గుర్తింపు, గౌరవం, బాధ్యతలు కల్పించడం తన బాధ్యతగా భావిస్తున్నట్లు చెప్పారు. పార్టీ కోసం పనిచేసిన వారికి భవిష్యత్తులో తగిన అవకాశాలు కల్పించే విషయంలో నాయకత్వం ప్రత్యేక దృష్టి సారిస్తుందని తెలిపారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కార్యకర్తల సంక్షేమానికి ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్నామని లోకేశ్ పేర్కొన్నారు. కార్యకర్తల సంక్షేమం కోసం ఇప్పటివరకు రూ.160 కోట్లు ఖర్చు చేసిన ఏకైక పార్టీ టీడీపీ అని ఆయన అన్నారు. పార్టీ కోసం పనిచేసే కార్యకర్తలకు ప్రభుత్వం, పార్టీ అండగా ఉంటాయనే నమ్మకాన్ని మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని చెప్పారు.

**ఉత్తరాంధ్ర అభివృద్ధికి ప్రాధాన్యం**

ఉత్తరాంధ్ర అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి స్పష్టం చేశారు. వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి అవసరమైన మౌలిక వసతులు, పరిశ్రమలు, ఉపాధి అవకాశాల కల్పనపై ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారిస్తోందని తెలిపారు. యువతకు స్థానికంగానే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేలా పెట్టుబడులను ఆకర్షించాల్సిన అవసరం ఉందన్నారు. విజయనగరం, శ్రీకాకుళం, విశాఖపట్నం, మన్యం జిల్లాలతో కూడిన ఉత్తరాంధ్రలో అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేయడం ద్వారా ఈ ప్రాంత ఆర్థిక సామర్థ్యాన్ని మరింత పెంచుతామని లోకేశ్ పేర్కొన్నారు. రహదారులు, విద్య, పరిశ్రమలు, ఉపాధి, మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు తెలిపారు.

**స్థానిక ఎన్నికలే తదుపరి లక్ష్యం**

త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని టీడీపీ శ్రేణులు ఇప్పటి నుంచే క్షేత్రస్థాయిలో సమన్వయంతో పనిచేయాలని లోకేశ్ సూచించారు. గ్రామాలు, మండలాలు, పట్టణాల్లో పార్టీ బలాన్ని మరింత పెంచాలని, ప్రజలకు అందుతున్న ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను వివరించాలని చెప్పారు. కూటమి భాగస్వామ్య పార్టీలతో సమన్వయం చేసుకుంటూ స్థానిక ఎన్నికల్లో మంచి ఫలితాలు సాధించేందుకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఎన్నికల్లో పార్టీ విజయానికి కేవలం నాయకుల ప్రచారం మాత్రమే కాకుండా ప్రతి కార్యకర్త ఇంటింటికీ వెళ్లి ప్రజలతో మమేకం కావడం కీలకమని స్పష్టం చేశారు.

## డీఎస్సీపై రాజకీయ సమరం

డీఎస్సీ నియామకాలు ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో మరోసారి ప్రధాన చర్చనీయాంశంగా మారాయి. ఉపాధ్యాయ ఉద్యోగాల భర్తీ, పోస్టుల సంఖ్య, నియామక ప్రక్రియ వంటి అంశాలపై అధికార టీడీపీ, ప్రతిపక్ష వైసీపీ మధ్య విమర్శలు, ప్రతివిమర్శలు కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలోనే జగన్‌తో బహిరంగ చర్చకు సిద్ధమని లోకేశ్ మరోసారి సవాల్ చేయడం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. జగన్ సమయం, తేదీ ఖరారు చేస్తే తాను చర్చకు సిద్ధమని లోకేశ్ స్పష్టం చేయడం ద్వారా డీఎస్సీ అంశంపై తన వాదనను ప్రజల ముందే నిరూపించుకునేందుకు సిద్ధంగా ఉన్నానన్న సంకేతాన్ని ఇచ్చారు. దీంతో రానున్న రోజుల్లో డీఎస్సీ వ్యవహారం మరింత రాజకీయ వేడిని రాజేసే అవకాశం కనిపిస్తోంది.

# నన్ను టార్గెట్ చేస్తున్నవారిపై చర్యలు తీసుకోండి

**.. మంత్రి కొండా సురేఖ మరో లేఖ**

**హైదరాబాద్, మహా** : తనపై, తన కుటుంబ సభ్యులపై కొందరు పార్టీ నాయకులు క్రమబద్ధంగా జరుపుతున్న దాడుల వెనుక అదృశ్య హస్తం ఉందంటూ అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ శనివారం టిపిసిసిక్రమశిక్షణా కమిటీ చైర్మన్ మల్లు రవికి లేఖ రాశారు. టిపిసిసి క్రమశిక్షణా కమిటీ జారీ చేసిన నోటీసుకు ఇప్పటికే వివరణ ఇచ్చానని, పార్టీ క్రమశిక్షణపై తనకు సంపూర్ణ గౌరవం ఉందని మంత్రి పేర్కొన్నారు. నోటీసును ఉపసంహరించుకోవాలని కోరినప్పటికీ విమర్శలు ఆగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పలువురు సీఎల్పీ నాయకులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు మహిళా నేతలు ఒకే తరహాలో తనను, తన కుటుంబాన్ని లక్ష్యంగా చేసుకుని మాట్లాడుతున్నారని లేఖలో తెలిపారు. ఇది స్వతంత్రంగా చేస్తున్న వ్యాఖ్యలు కాదని, వెనుక ఉండి ఎవరో ప్రేరేపిస్తూ, నిర్దేశిస్తున్నట్లు అనుమానం కలుగుతోందని ఆరోపించారు.

# వృద్ధుల ముసుగులో గంజాయి రవాణా

- ఐదుగురు అరెస్ట్
- 38 కిలోల డ్రై గంజాయి స్వాధీనం
- విలువ రూ.10 లక్షలు

**హైదరాబాద్, మహా** : వయసు పైబడిన ప్రయాణికులపై సాధారణంగా అనుమానం తక్కువగా ఉంటుందనే విషయాన్ని ఆసరాగా చేసుకుని గంజాయిని రవాణా చేస్తున్న ఐదుగురిని హైదరాబాద్ సీసీఎస్ ప్రత్యేక క్రైమ్ టీమ్, గాంధీనగర్ పోలీసులు సంయుక్తంగా పట్టుకున్నారు. వారి నుంచి సుమారు 38 కిలోల డ్రై గంజాయిని, దీని విలువ దాదాపు రూ.10 లక్షలు ఉంటుందని పోలీసులు తెలిపారు. ఆగస్టు 21న విశ్వసనీయ సమాచారం అందడంతో సీసీఎస్ క్రైమ్ టీమ్, గాంధీనగర్ పోలీసులతో కలిసి దాడి చేసి నిందితులను అదుపులోకి తీసుకుంది. అరెస్టైన వారిలో రాజారాం స్వామి కన్ను పడయాచి (78), సంతోష్ బాలారం ప్రజాపతి (65), విజయలక్ష్మి కలియమూర్తి పిల్లై (66), సిల్మినా కుజూర్ (36), షీలా దేవి (48) ఉన్నారు. వీరిలో కొందరు కూలీలు, మరికొందరు గృహ సహాయకులుగా పనిచేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు.

**అరకు నుంచి హైదరాబాద్ మీదుగా ముంబైకి..**

పోలీసుల వివరాల ప్రకారం.. నిందితులు విశాఖపట్నం జిల్లా అరకు ప్రాంతం నుంచి పెద్ద మొత్తంలో గంజాయిని సేకరించి, బ్రౌన్ కలర్ పార్సిల్ కవర్లలో ప్యాక్ చేసేవారు. అనంతరం బస్సుల్లో గంజాయి పార్సిళ్లను హైదరాబాద్‌కు తరలించి, ఇక్కడ మరో బస్సు ఎక్కి ముంబైకి వెళ్లేవారు. అక్కడ ముందుగా సూచించిన ప్రాంతాల్లో గంజాయి పార్సిళ్లను అప్పగించేవారు.

**వయసును అడ్డుపెట్టుకుని..**

వృద్ధ ప్రయాణికులపై అనుమానం తక్కువగా ఉంటుందనే విషయాన్ని అక్రమ రవాణా నిర్వాహకులు తమకు అనుకూలంగా ఉపయోగించుకున్నట్లు పోలీసులు గుర్తించారు. నిందితులు అరకు నుంచి బయలుదేరే సమయంలో పార్సిళ్లను తమ సాధారణ సామాన్లతో కలిపి తీసుకెళ్లేవారు. అనుమానం రాకుండా హైదరాబాద్ చేరుకున్న తర్వాత కొంతసేపు వేరే లాడ్జిలో బస చేసి, ముందుగా నిర్ణయించిన మరో బస్సులో ముంబైకి వెళ్లేవారని పోలీసులు తెలిపారు. ప్రతి డెలివరీకి నిందితులకు సుమారు రూ.10 వేల నుంచి రూ.12 వేల వరకు కమీషన్ చెల్లించేవారని ప్రాథమిక దర్యాప్తులో వెల్లడైంది.

**గతంలోనూ గంజాయి రవాణా?**

అరెస్టైన నిందితులకు గతంలోనూ గంజాయి రవాణాకు సంబంధించిన నేర చరిత్ర ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ఈ వ్యవహారం వెనుక ఉన్న ప్రధాన వ్యక్తి ఎవరు? అరకు నుంచి గంజాయిని సరఫరా చేస్తున్న నెట్‌వర్క్ ఎంత విస్తరించింది? ముంబైలో పార్సిళ్లను స్వీకరిస్తున్న వ్యక్తులు ఎవరు? అనే కోణాల్లో దర్యాప్తు కొనసాగుతోంది. ఈ ఆపరేషన్‌ను సీసీఎస్ క్రైమ్ టీమ్ ఇన్‌స్పెక్టర్ చి. సుధాకర్ రావు, ఎస్ఐ ఎన్. గౌరేందర్ గౌడ్ తమ సిబ్బందితో కలిసి గాంధీనగర్ పోలీసుల సమన్వయంతో నిర్వహించారు. డీసీపీ, సీసీఎస్ ఎస్. చైతన్య కుమార్, ఐపీఎస్ మార్గదర్శకత్వంలో ఈ చర్యలు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

## ప్రజలకు పోలీసుల హెచ్చరిక

గంజాయి, ఇతర మాదకద్రవ్యాల అక్రమ రవాణా, నిల్వ, విక్రయం లేదా పంపిణీలో ఎవరూ భాగస్వాములు కావొద్దని హైదరాబాద్ పోలీసులు హెచ్చరించారు. డబ్బు కోసం క్యారియర్‌లుగా వ్యవహరించినా ఎన్‌డీపీఎస్ చట్టం కింద కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. మాదకద్రవ్యాల అక్రమ రవాణాపై నిఘాను మరింత పెంచి, నెట్‌వర్క్‌లోని ఇతర వ్యక్తులను కూడా గుర్తించి చర్యలు తీసుకుంటామని పోలీసులు వెల్లడించారు.

# క్లాసిక్ లుక్‌లో మమిత బైజు

**క్లాసిక్ చీరకట్టులో మమిత బైజు మెరుపులు**

మలయాళ, తమిళ చిత్రసీమలో తనదైన గుర్తింపు తెచ్చుకుంటున్న యువ నటి మమిత బైజు సంప్రదాయ చీరకట్టులో అభిమానులను ఆకట్టుకుంటున్నారు. పచ్చని ఎమరాల్డ్ రంగు చీరపై అందమైన బంగారు అంచులు, ఆకర్షణీయమైన పర్పుల్ రంగు పఫ్ స్లీవ్స్ బ్లౌజ్‌తో ఆమె సరికొత్త లుక్‌లో మెరిశారు. సంప్రదాయ ఆభరణాలు, మల్లెపూలతో అలంకరించిన జడ, నుదుటన ఎర్రటి బొట్టుతో ఆమె అందం మరింత ఇనుమడించింది.సింపుల్‌గా కనిపించే బంగారు హారం, చెవిదిద్దులు, ఆకుపచ్చ గాజులు ఆమె చీరకట్టుకు చక్కగా సరిపోయాయి. ముఖ్యంగా ఆమె ముఖంపై కనిపించిన చిరునవ్వు ఫొటోకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఆధునికతతో పాటు సంప్రదాయ అందాన్ని మేళవించిన ఈ లుక్ సోషల్ మీడియాలో అభిమానుల దృష్టిని ఆకర్షిస్తోంది.2001 జూన్ 22న కేరళలోని కొట్టాయం జిల్లా కిడంగూరులో జన్మించిన మమిత బైజు చిన్ననాటి నుంచే సినిమాల్లోకి అడుగుపెట్టారు. 2016లో వచ్చిన 'పావాడ' చిత్రంలో బాలనటిగా కనిపించిన ఆమె.. 2017లో 'సర్వోపరి పాలక్కారన్'తో అధికారికంగా నటిగా పరిచయమయ్యారు. అనంతరం 'ఖో ఖో', 'సూపర్ శరణ్య' వంటి చిత్రాలతో నటిగా మంచి గుర్తింపు పొందారు. అయితే 2024లో విడుదలైన 'ప్రేమలు' చిత్రం మమిత కెరీర్‌ను ఒక్కసారిగా మలుపుతిప్పింది. ఇందులో రీను పాత్రలో ఆమె నటనకు ప్రేక్షకుల నుంచి విశేష స్పందన లభించింది. ఈ చిత్రం భారీ విజయాన్ని అందుకోవడంతో పాటు అత్యధిక వసూళ్లు సాధించిన మలయాళ చిత్రాల జాబితాలో చోటు సంపాదించింది. దీంతో మమిత దక్షిణాది యువ కథానాయికల్లో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నారు.ఇదే సమయంలో తమిళ చిత్రసీమలోనూ మమిత తన ప్రయాణాన్ని ప్రారంభించారు. 2024లో 'రెబల్' సినిమాతో తమిళ ప్రేక్షకులకు పరిచయమైన ఆమె.. 2025లో ప్రదీప్ రంగనాథన్‌కు జోడీగా నటించిన 'డ్యూడ్'తో మరింత గుర్తింపు తెచ్చుకున్నారు. విభిన్న కథలు, వైవిధ్యమైన పాత్రలను ఎంచుకుంటూ దక్షిణాది సినీ పరిశ్రమలో తన కెరీర్‌ను వేగంగా విస్తరిస్తున్నారు.ప్రస్తుతం ధనుష్‌తో 'కారా', విజయ్‌తో 'జన నాయకన్', సూర్యతో 'విశ్వనాథ్ & సన్స్', నివిన్ పౌలీతో 'బెత్లహేమ్ కుటుంబ యూనిట్', అలాగే 'ప్రేమలు 2' వంటి పలు ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టుల్లో మమిత నటిస్తున్నారు. వరుస విజయాలు, స్టార్ హీరోలతో అవకాశాలు రావడంతో దక్షిణాది సినీ పరిశ్రమలో ఆమె క్రేజ్ రోజురోజుకూ పెరుగుతోంది. సంప్రదాయ లుక్‌లోనూ, ఆధునిక పాత్రల్లోనూ తన ప్రత్యేకతను చూపిస్తూ మమిత బైజు యువ కథానాయికగా దూసుకెళ్తున్నారు.





# యశ్ టాక్సిక్‌పై భారీ అంచనాలు

రాకింగ్ స్టార్ యశ్ హీరోగా తెరకెక్కిన మోస్ట్ అవైటెడ్ మూవీ 'టాక్సిక్: ఎ ఫెయిరీ టేల్ ఫర్ గ్రోన్‌అప్స్'. గీతు మోహన్‌దాస్ దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రంలో నయనతార, కియారా అద్వానీ, తారా సుతారియా, రుక్మిణి వసంత్, హుమా ఖురేషి కీలక పాత్రలు పోషించారు. కేవీఎన్ ప్రొడక్షన్స్, మాన్‌స్టర్ మైండ్ క్రియేషన్స్ సంయుక్తంగా నిర్మించిన ఈ సినిమా ఇంగ్లిష్, కన్నడ భాషల్లో రూపొందింది. హిందీ, తెలుగు, తమిళం, మలయాళంలో డబ్బింగ్ వెర్షన్లు విడుదల కానున్నాయి.ఆగస్టు 26, 2026న ప్రపంచవ్యాప్తంగా 'టాక్సిక్' ప్రేక్షకుల ముందుకు రానుంది. సినిమా విడుదలకు ముందు హైదరాబాద్‌లో చిత్రబృందం గ్రాండ్ ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించింది. ఈ సందర్భంగా నిర్మాత కేవీఎన్ మాట్లాడుతూ.. భారీ విజన్, బోల్డ్ ఆలోచనతో సినిమాను రూపొందించామని తెలిపారు. ట్రైలర్‌లో కనిపించే ప్రతి ఫ్రేమ్‌లో చిత్రబృందం తీసుకున్న శ్రద్ధ స్పష్టంగా కనిపిస్తుందని చెప్పారు. 'టాక్సిక్' ప్రేక్షకులకు కొత్త అనుభూతిని అందిస్తుందని నిర్మాత పేర్కొన్నారు. సినిమా చూసే ప్రతి ఒక్కరికీ భిన్నమైన ఫీలింగ్ కలుగుతుందని అన్నారు. యశ్ భారతీయ సినిమాను గ్లోబల్ స్థాయికి తీసుకెళ్లేందుకు నిరంతరం ప్రయత్నిస్తున్నారని ప్రశంసించారు. దర్శకురాలు గీతు మోహన్‌దాస్ ప్రతి సన్నివేశంలో భావోద్వేగాలను అద్భుతంగా ఆవిష్కరించారని, సినిమా కోసం ఎంతో శ్రమించారని చెప్పారు. నయనతార, కియారా అద్వానీ, రుక్మిణి వసంత్, హుమా ఖురేషి తదితరులు తమ పాత్రల్లో మెప్పించారని నిర్మాత తెలిపారు. సంగీత దర్శకులు విశాల్ మిశ్రా, రవి బస్రూర్ అద్భుతమైన సంగీతాన్ని అందించారని పేర్కొన్నారు. సినిమాకు పనిచేసిన ప్రతి ఒక్కరికీ ఆయన కృతజ్ఞతలు తెలిపారు. దిల్ రాజుతో కలిసి పనిచేయడం సినిమాకు అదనపు బలాన్ని ఇచ్చిందని కేవీఎన్ అన్నారు. 'టాక్సిక్'ను ప్రేక్షకులకు చేరువ చేసేందుకు సరైన భాగస్వామ్యం లభించిందని చెప్పారు. సినిమా విడుదల కోసం అవసరమైన సహకారాన్ని అందిస్తున్న ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. హైదరాబాద్ ప్రీ రిలీజ్ ఈవెంట్‌కు సహకరించిన పోలీస్ శాఖకు ప్రత్యేక కృతజ్ఞతలు చెప్పారు. 'టాక్సిక్' కేవలం ప్రేక్షకులను ఎంగేజ్ చేయడం, ఎగ్జైట్ చేయడమే కాకుండా వారి పల్స్‌రేట్‌ను మార్చే అనుభూతిని ఇస్తుందని నిర్మాత వ్యాఖ్యానించారు. ఇదే సందర్భంగా మెగాస్టార్ చిరంజీవికి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

# 'రాకా'పై పెరుగుతున్న అంచనాలు

ఐకాన్ స్టార్ అల్లు అర్జున్, స్టార్ డైరెక్టర్ అట్లీ కాంబినేషన్‌లో రూపొందుతున్న ప్రతిష్ఠాత్మక చిత్రం 'రాకా'. సన్ పిక్చర్స్ భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్న ఈ సైంటిఫిక్ యాక్షన్ థ్రిల్లర్‌పై ఇప్పటికే భారీ అంచనాలు ఉన్నాయి. సినిమాకు సంబంధించిన ప్రతి కొత్త అప్‌డేట్ ప్రేక్షకుల్లో ఆసక్తిని మరింత పెంచుతోంది.తాజాగా నటి మంచు లక్ష్మి 'రాకా' షూటింగ్ సెట్‌ను సందర్శించారు. అక్కడ జరుగుతున్న భారీ స్థాయి పనులను చూసి ఆమె ఆశ్చర్యం వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. ఇప్పటి వరకు తాను చూడని వింత జీవులు, భారీ మొక్కలు, అద్భుతమైన సెట్స్ తనను ఆకట్టుకున్నాయని ఆమె పేర్కొన్నారు. వందలాది మంది వివిధ విభాగాల్లో కలిసి ఒక కొత్త ప్రపంచాన్ని సృష్టిస్తున్న విధానం ప్రత్యేకంగా అనిపించిందని తెలిపారు.'రాకా'లో చూపించబోయే ప్రపంచం ప్రేక్షకుల ఊహలకు కూడా అందని విధంగా ఉంటుందని మంచు లక్ష్మి అభిప్రాయపడ్డారు. ఇలాంటి భారీ విజువల్ ట్రీట్‌ను వెండితెరపై చూసేందుకు తాను కూడా ఆసక్తిగా ఎదురుచూస్తున్నానని చెప్పారు. ఆమె వ్యాఖ్యలు ఇప్పుడు సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారడంతో సినిమాపై అంచనాలు మరింత పెరిగాయి. అల్లు అర్జున్‌ను అట్లీ తొలిసారి డైరెక్ట్ చేస్తున్న ఈ ప్రాజెక్ట్‌లో బాలీవుడ్ స్టార్ హీరోయిన్ దీపికా పదుకొణె కీలక పాత్రలో కనిపించనున్నట్లు సమాచారం. సైంటిఫిక్ అంశాలతో పాటు భారీ యాక్షన్, గ్రాండ్ సెట్స్, అత్యాధునిక విజువల్ ఎఫెక్ట్స్‌తో సినిమాను రూపొందిస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే విడుదలైన టైటిల్ గ్లింప్స్, ఫస్ట్ లుక్ పోస్టర్ సినిమాపై క్యూరియాసిటీని పెంచాయి. తాజాగా మంచు లక్ష్మి సెట్ విజిట్ తర్వాత చేసిన వ్యాఖ్యలు 'రాకా' ఏ స్థాయిలో తెరకెక్కుతోందనే ఆసక్తిని మరింత పెంచుతున్నాయి. అట్లీ-బన్నీ కాంబినేషన్‌లో వస్తున్న ఈ విజువల్ వండర్ ప్రేక్షకులను ఏ మేరకు ఆకట్టుకుంటుందో చూడాలి.




# ఇరుముడిలో మోక్షద కీలక పాత్ర

మాస్ మహారాజా రవితేజ, దర్శకుడు శివ నిర్వాణ కాంబినేషన్‌లో రూపొందిన 'ఇరుముడి' ప్రస్తుతం ప్రేక్షకుల నుంచి మంచి స్పందనను అందుకుంటూ విజయవంతంగా దూసుకెళ్తోంది. సినిమాకు పాజిటివ్ టాక్ రావడంతో చిత్రానికి సంబంధించిన పలు ఆసక్తికర విషయాలు సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారుతున్నాయి. ముఖ్యంగా రవితేజ కుమార్తె మోక్షద భూపతిరాజు ఈ ప్రాజెక్ట్‌లో పోషించిన బాధ్యతలపై సినీ వర్గాల్లో ఆసక్తి నెలకొంది.సినీ వర్గాల సమాచారం ప్రకారం.. 'ఇరుముడి'కి మోక్షద ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్‌గా పనిచేసినట్లు తెలుస్తోంది. అయితే ఆమె పాత్ర కేవలం ఆ బాధ్యతలకే పరిమితం కాలేదని ప్రచారం జరుగుతోంది. సినిమా ప్రాజెక్ట్ ప్రారంభ దశ నుంచి నిర్మాణానికి సంబంధించిన పలు వ్యవహారాలను ఆమె దగ్గరుండి పర్యవేక్షించినట్లు సమాచారం. అంతేకాకుండా కథను రవితేజ ఓకే చేయడంలోనూ మోక్షద కీలకంగా వ్యవహరించినట్లు టాక్ వినిపిస్తోంది.తండ్రి రవితేజ నుంచి సినిమా నిర్మాణానికి సంబంధించిన అనుభవాలను నేర్చుకుంటున్న మోక్షద.. సినీ పరిశ్రమలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకునే ప్రయత్నం చేస్తున్నట్లు తెలుస్తోంది. భవిష్యత్‌లో రవితేజ నటించే కొన్ని ప్రాజెక్టుల నిర్మాణ వ్యవహారాల్లోనూ ఆమె కీలకంగా భాగస్వామి కానున్నారనే ప్రచారం సాగుతోంది. అయితే దీనిపై ఇప్పటివరకు అధికారిక ప్రకటన వెలువడేదు.'ఇరుముడి' విడుదలైన తర్వాత మోక్షద పేరు సోషల్ మీడియాలో మరింతగా వినిపిస్తోంది. సినిమా నిర్మాణంలో ఆమె చేసిన కృషికి తగిన గుర్తింపు ఇవ్వాలని పలువురు నెటిజన్లు పోస్టులు చేస్తున్నారు. దీంతో రవితేజ కుమార్తె సినీ రంగంలో తన ప్రయాణాన్ని ఏ విధంగా కొనసాగిస్తారనే ఆసక్తి పెరుగుతోంది.ఇదిలా ఉంటే.. రవితేజ కుమారుడు మహాధన్ కూడా సినీ రంగంలోకి అడుగులు వేస్తున్నారు. సెన్సేషనల్ డైరెక్టర్ సందీప్ రెడ్డి వంగా తెరకెక్కిస్తున్న 'స్పిరిట్' చిత్రానికి అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేస్తున్నట్లు సమాచారం. దీంతో రవితేజ కుటుంబం నిర్మాణం, దర్శకత్వ విభాగాల్లోనూ సినీ పరిశ్రమలో తమ ప్రయాణాన్ని కొనసాగిస్తుండటం ఆసక్తికరంగా మారింది.



EDITOR, PRINTER,PUBLISHER AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, PRINTED AT 19-12-458, BAIRAGIPATTEDA, TIRUPATHI - 517501, A.P., REGD NO : APTEL/2014/58382. PH NO : 6300992296, Email : mahapathrika2003@gmail.com. PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. Corporate Office : 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana, IN - 500034